యూపీఎస్సీ పరీక్షలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

సిటీబ్యూరో, సెప్టెంబర్ 19(నమస్తే తెలంగాణ): యూపీఎస్సీ పరీక్షల సందర్భంగా ఆర్టీసీ గ్రేటర్‌లో ప్రత్యేక బస్సులను కేటాయించనుందని అధికారులు తెలిపారు. అభ్యర్థుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా సెంటర్లకు బస్సుల సేవలు పెంచుతున్నట్టు చెప్పారు. బస్టాండ్‌లలో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేశామని వివరించారు. అభ్యర్థులు బస్సుల సమాచారం కోసం ఫోన్ నం. 99592 26160, 99592 26154లను సంప్రదించొచ్చని పేర్కొన్నారు.

21న గెజిటెడ్ అధికారుల అసోసియేషన్ ఎన్నికలు

మేడ్చల్ కలెక్టరేట్, సెప్టెంబర్ 19: తెలంగాణ గెజిటెడ్ అధికారుల అసోసియేషన్ ఎన్నికలు ఈ నెల 21వ తేదీన నిర్వహిస్తున్నామని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం నేతలు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని తూంకుంట పరిధిలోని మెగుళ్ళ వెంకటరామిరెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సెంట్రల్ తెలంగాణ గెజిటెడ్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలూరి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షులు శ్యామ్, కోశాధికారి ఉపేందర్ రెడ్డి, మాజీ అధ్యక్షులు శ్రీనివాస్ మూర్తిలతో పాటు కేంద్ర సంఘం సభ్యులు విచ్చేస్తారని అన్నారు. జిల్లాలోని గెజిటెడ్ అధికారులంతా ఈ ఎన్నికలను విజయవంతం చేయాలని కోరారు.

21న మేడ్చల్‌లో జాబ్ మేళా

మేడ్చల్ కలెక్టరేట్, సెప్టెంబర్ 19: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని నిరుద్యోగులకు ఈ నెల 21న మేడ్చల్ ఐటీఐ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం.రాధిక తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, డిప్లమా చదివి అర్హత, ఆసక్తి గల యువత WWW.NIC.GOV.IN లో పోర్టల్ రిజిస్టర్ చేసుకొని జాబ్‌మేళాకు హాజరు కావాలని కోరారు. మేళాలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఇంటర్వ్యూ ఉంటుందని, ఇతర వివరాలకు ఫోన్ నం. 98664 65024, 73868 09422 సంప్రదించాలని సూచించారు.

సంతూర్ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్ 9వ ఎడిషన్

సిటీబ్యూరో, సెప్టెంబర్ 19(నమస్తే తెలంగాణ): విప్రో కన్స్యూమర్ కేర్ అండ్ విప్రో కేర్స్ సంతూర్ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్ 9వ ఎడిషన్‌ను ప్రకటించింది. వెనకబడిన వర్గాల బాలికల సాధికారతకు తోడ్పడటానికి ఈ స్కాలర్‌షిప్ ఉపయోగపడుతుందని విప్రో లిమిటెడ్, ప్రోగ్రామ్ గ్లోబల్ హెడ్ పీఎస్ నారాయణ్ తెలిపారు. విస్తృతమైన అకడమిక్ సాధనలను ప్రోత్సహించడానికి రూపొందించిన ఈ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్‌లో 1500 మంది బాలికలు, యువతులను ప్రోత్సహించడానికి నిర్ణయించినట్టు, 60 శాతం హ్యుమానిటీస్, లిబరల్ ఆర్ట్స్, సైన్సెస్‌లో డిగ్రీలు అభ్యసించే విద్యార్థులకు, మిగతా 40 శాతం ఇంజనీరింగ్, మెడిసిన్ వంటి ప్రొఫెషనల్ ప్రోగ్రామ్‌లలో నమోదు చేసుకున్నవారికి ఇస్తామని ఆయన తెలిపారు. సంతూర్ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్ కోసం ఈ నెల 21 నుంచి సెప్టెంబర్ 30 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు. మరిన్ని వివరాలకు www.santoorscholarships.com సందర్శించాలని నిర్వాహకులు తెలిపారు.

పారిశుధ్యానికి.. నగరం.. నిదర్శనం!

నగరంలో ఆరోగ్య తెలంగాణ దిశగా అడుగులు పడుతున్నాయనడానికి ఈ చెత్త దర్శనం.. నిదర్శనం. నగరంలోని ప్రతి కాలనీ మూల మలుపుల్లో దర్శనమిస్తున్నాయి.. ఇలాంటి చెత్త దృశ్యాలెన్నో! చెత్త కుప్పలు కుప్పలుగా పేరుకుపోయి దుర్గంధాన్ని వెదజల్లుతూ నగర ప్రజల ముక్కు పుటలు అదిరేలా.. చేస్తున్నాయి. అసలే వర్షాకాలం.. ఆపై అప్పుడప్పుడు పారిశుధ్యం... వెరసి సగటు నగర జీవి రోగి అయ్యేలా.. ప్రభుత్వ యంత్రాంగం తీరూ తెన్నూ మార్గదర్శకంగా ఉంది. పాలకుల తీరుకు, అధికార యంత్రాంగం విధి, విధానాలకు ఈ చెత్త కుప్పలు ఓ తార్కాణం. ప్రజారోగ్యంపై ప్రభుత్వాధినేతలకు ఎంతమాత్రం జాగరూకత ఉందో ఇక్కడ కనిపిస్తున్న ఈ చిత్రం చెప్పకనే చెబుతుంది. అయినా.. పాలకుల వ్యవహారంలో మార్పు వస్తున్నదని అనుకుందాం.. అనుకుంటే... ఇప్పటికే ఇలాంటి కథనాలెన్నో.. కుప్పలు తెప్పలుగా ఉండి.. సగటు నగరజీవిని ఆ భావన నుంచి బలహీన పరుస్తున్నాయి.

ఖైదీలను తీర్చి దిద్దేందుకే.. చట్టాన్ని ఆధునీకరించాలి

ప్రిజన్స్ అండ్ కరెక్షనల్ సర్వీసెస్ డీజీ డాక్టర్ సౌమ్య మిశ్రా

నల్సార్‌లో మోడల్ ప్రిజన్స్ అండ్ కరెక్షనల్ సర్వీసెస్ యాక్ట్-2023పై వర్క్‌షాప్

నల్సార్ యూనివర్సిటీ వర్క్‌షాప్‌లో జైళ్ళ శాఖ అధికారులు, వర్సిటీ ప్రొఫెసర్లు

శామీర్‌పేట, సెప్టెంబర్ 19: ఆధునిక అవసరాలకు ఖైదీల దిద్దుబాటు చేసేందుకు అనుగుణంగా బలమైన ప్రగతి శీల చట్టం ద్వారా ఆధునీకరణ జరగాలని కేంద్ర ప్రభుత్వం మోడల్ ప్రిజన్స్ అండ్ కరెక్షనల్ సర్వీసెస్ యాక్ట్-2023ను తీసుకువచ్చిందని తెలంగాణ రాష్ట్ర ప్రిజన్స్ అండ్ కరెక్షనల్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్య మిశ్రా అన్నారు. నల్సార్ న్యాయ విశ్వ విద్యాలయం సెంటర్ ఫర్ చైల్డ్ అండ్ యూత్ జస్టిస్ - తెలంగాణ రాష్ట్ర జైళ్ళశాఖ సహకారంతో తెలంగాణ రాష్ట్రంలో మోడల్ ప్రిజన్స్ అండ్ కరెక్షనల్ సర్వీసెస్ యాక్ట్-2023 అడాప్షన్‌పై సంప్రదింపుల వర్క్‌షాప్‌ను గురువారం నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మిశ్రా మాట్లాడుతూ ఖైదీల చట్టం-1900 వందేండ్ల పాతది. కాబట్టి ఈ చట్టాల ఆధునీకరణ, అవసరాలకు అనుగుణంగా ఖైదీలకు దిద్దుబాటు చర్యలు చేపట్టేందుకు అనుగుణంగా బలమైన ప్రగతి శీల చట్టం ద్వారా ఆధునీకరణ జరగాలని, అందుకు కేంద్రం మోడల్ ప్రిజన్స్ అండ్ కరెక్షనల్ సర్వీసెస్ యాక్ట్-2023ను తీసుకువచ్చిందన్నారు. దేశంలోని జైళ్ళను నియంత్రించే ప్రస్తుత చట్టాలు 'ది ప్రిజన్స్ యాక్ట్' వారి అధికార పరిధిలో జైలు చట్టాన్ని సవరించడంలో మోడల్ చట్టంలో అందించిన మార్గదర్శకాలను ఉపయోగించుకోవాలని హోమ్ మంత్రిత్వ శాఖ అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించిందన్నారు. భారత రాజ్యాంగం ప్రకారం, రాష్ట్ర జాబితా దీనిని అనుసరించి 'తెలంగాణ రాష్ట్ర జైళ్ళ శాఖ - నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా' మార్గదర్శకత్వంతో తెలంగాణ రాష్ట్రానికి నమూనా చట్టాన్ని ఆమోదించే ప్రక్రియలో ఉందన్నారు. నల్సార్ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు దాదాపు 300ల చట్టాలు, నియమాల, నిబంధనల ముసాయిదా, సమీక్షలో ప్రభుత్వానికి సహకరించిందన్నారు. నేడు మొదటి సెషన్‌లో తెలంగాణ కోసం మోడల్ జైళ్ళ చట్టం-2023 యొక్క తెలంగాణ రాష్ట్ర అవసరాల కోసం చేర్పులు చేసుకోవడం, చట్టంపై సమీక్ష, విధి విధానాలపై చర్చించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రిజన్స్ అండ్ కరెక్షనల్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్య మిశ్రా, ప్రిజన్స్ ఐజీ వై.రాజేశ్, ప్రిజన్స్ వెల్ఫేర్ ఐజీ మురళీబాబు, డీఐజీలు శ్రీనివాస్, సంపత్, నల్సార్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్.వాసంతి, సెంటర్ ఫర్ చైల్డ్ అండ్ యూత్ జస్టిస్ కో ఆర్డినేటర్, క్రిమినల్ లా ఫ్యాకల్టీ డాక్టర్ బాలకృష్ణ, ప్రొఫెసర్లు కేశవరావు, కేవీకే శాంతి, డాక్టర్ మల్లికార్జున్, మురళీకర్ణం, రోస్మీజోన్, జైలు అధికారులు పాల్గొన్నారు.

పద్మశాలి భవన్‌లో దసరా మేళా బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ ఎల్.రమణ,అనిల్ కుమార్ తదితరులు

పద్మశాలీల ఐక్యత సర్వతోముఖాభివృద్ధికి దోహదం

- వచ్చే నెల 20న పద్మశాలి దసరా మేళాకు తరలిరండి
- ఎమ్మెల్సీ ఎల్.రమణ పిలుపు

హిమాయత్‌నగర్, సెప్టెంబర్ 19: రాష్ట్రంలోని పద్మశాలీలు సంఘటితమైతేనే సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్సీ ఎల్.రమణ, రాష్ట్ర ఖనిజ అభివృద్ధి కార్పొరేషన్ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్, అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి అన్నారు. పద్మశాలి సంఘం ఎల్బీనగర్ సర్కిల్ ఆధ్వర్యంలో అక్టోబర్ 20న ఆటోనగర్‌లోని హరిణి వనస్థలి అనన్య ఎకో పార్క్ ఆవరణలో జరిగే 22వ పద్మశాలి దసరా మేళాకు తరలిరావాలని వారు పిలుపునిచ్చారు. ఆ మేళాకు సంబంధించిన బ్రోచర్ ఆవిష్కరణ గురువారం నారాయణ గూడలోని పద్మశాలి భవన్‌లో జరిగింది. అనంతరం జరిగిన సన్నాహక సమావేశంలో పద్మశాలి సంఘం ఎల్బీనగర్ సర్కిల్ అధ్యక్షుడు పున్న గణేశ్ నేత, మేళా కమిటీ చైర్మన్ కౌకుంట్ల రవితేజతో కలిసి వారు మాట్లాడుతూ పద్మశాలీల ఐక్యతను చాటేందుకు దసరా మేళా ఎంతో దోహద పడుతుందన్నారు. రాజకీయ రంగంలో మరింత ఎదిగి తమ జాతి అభివృద్ధి కోసం పాటు పడాలన్నారు. సమావేశంలో పద్మశాలి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల రాంచందర్, మహిళా విభాగం జాతీయ అధ్యక్షురాలు వనం దుశ్యంతల, రాష్ట్ర నాయకులు అవ్వారి భాస్కర్, రాపోలు సుధాకర్ నేత, సంధ్యారాణి, గుంటక రాపా సదాశివ్, బోళ్ల శివశంకర్, తిరుపతి, కత్తుల సుదర్శన్ పాల్గొన్నారు.

ఎమ్మార్సీలో మొబైల్ ల్యాబ్ ప్రారంభం

మొబైల్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్

మేడ్చల్, సెప్టెంబరు 19: గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని మల్లారెడ్డి కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్‌లో ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్ మొబైల్ ల్యాబ్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణలోనే మొట్ట మొదటి సారిగా మొబైల్ ల్యాబ్‌ను ఎంఆర్‌సీలో ప్రారంభించామన్నారు. ఈ ల్యాబ్‌లో 3డీ ప్రింటింగ్, 4.0 కిట్స్, ల్యాప్‌టాపులు ఉంటాయన్నారు. సమాజానికి ప్రయోగాత్మక విద్యను ఏ ప్రాంతంలోనైనా అందించాలనే ఉద్దేశంతో ఇన్నోసిస్ స్ప్రింగ్ బోర్డ్, మేకర్ ల్యాబ్ ఆన్ వీల్స్ అనే పేరుతో మొబైల్ ల్యాబ్‌ను ప్రారంభించిందన్నారు. ఈ నెల 23 వరకు ఎంఆర్‌సీఈ క్యాంపస్‌లో ఉంటుందని, ఇతర కళాశాలల విద్యార్థులకు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డీన్ వివేకానంద, టీపీవో కుమార్, డీన్‌లు, హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

ఏఎన్ఎంల బకాయి వేతనాలు మంజూరు చేయాలి

బౌట్ సోర్సింగ్ ప్రతినిధి బృందం

సంక్షేమ శాఖ ఉప సంచాలకులు చందనకు వినతి పత్రాన్ని అందజేస్తున్న నరసింహా

హిమాయత్‌నగర్, సెప్టెంబర్ 19: ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్లో బౌట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేసే ఏఎన్ఎంలకు బకాయి వేతనాలు మంజూరు చేయాలని గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు చందనను ప్రతినిధి బృందం కలిసి వినతి పత్రాన్ని అందజేసింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహా మాట్లాడుతూ, రెండేండ్ల క్రితం 623 మంది ఏఎన్ఎంలను బౌట్ సోర్సింగ్ విధానంలో తీసుకున్నారని, వీరంతా పేద కుటుంబాలకు చెందినవారేనని తెలిపారు. గిరిజన సంక్షేమ హాస్టల్ ఆవరణలో వీరు ఉండేందుకు వసతి సౌకర్యాలు లేక పోవడంతో అద్దె ఇండ్లల్లో ఉంటున్నారని, వీరికి పదినెలల నుంచి జీతాలు లేకపోవడంతో ఆర్థికంగా తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సంక్షేమ శాఖ ఉప సంచాలకులు చందన సానుకూలంగా స్పందించి బకాయి వేతనాలు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్టు నరసింహా తెలిపారు. ఈ కార్యక్రమంలో బౌట్ సోర్సింగ్ ఏఎన్ఎం యూనియన్ నాయకులు పద్మ, ప్రమీల, నాగమణి, సింధు, రమా, విజయ్ పాల్గొన్నారు.

క్యాబినెట్ కమిటీని వెంటనే రద్దు చేయాలి

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కో కన్వీనర్ చెరుకు రాంచందర్

సమావేశంలో మాట్లాడుతున్న రాంచందర్

ఖైరతాబాద్, సెప్టెంబర్ 19: ఎస్సీ వర్గీకరణ అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్యాబినెట్ కమిటీని వెంటనే రద్దు చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కో కన్వీనర్ చెరుకు రాంచందర్ డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ వల్ల ఎక్కువగా మాలలు నష్టపోతారని, కొన్నేండ్లుగా మాలలు తక్కువగా ఉన్నట్లు సంఖ్యను చూపిస్తూ తమకు అన్యాయం చేస్తున్నారన్నారు. మాల మాదిగల సంఖ్యను తేల్చేందుకు సమగ్ర కుల గణన చేపట్టి, నిజంగా వెసులుబాటు అనుభవిస్తున్నది ఎవరనేది తేల్చాలని, తద్వారా ఆయా కులాలకు న్యాయం చేయాలన్నారు. ఎస్సీ వర్గీకరణను ఎట్టి పరిస్థితుల్లో అమలు కానివ్వమని, గ్రామ స్థాయి నుంచి ఢిల్లీ వరకు పోరాటాలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో కరణం కిషన్, సుధీర్, మన్నె రంగా, రమా, రత్నం పాల్గొన్నారు.

22 నుంచి గో ప్రతిష్ఠా యాత్ర

బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న ముకుందానంద, లక్ష్మీనారాయణ, విజయ, శ్రీకాంత్, శివ కుమార్ తదితరులు

ఖైరతాబాద్, సెప్టెంబర్ 19: గోమాతను జాతీయ మాతగా ప్రకటించాలని శంకరాచార్య అవిముక్తేశ్వరానంద జీ నేతృత్వంలో ఈ నెల 22 నుంచి అక్టోబర్ 26వ తేదీ వరకు గో ప్రతిష్ఠా యాత్ర నిర్వహించనున్నట్లు యాత్ర కమిటీ ప్రతినిధి ముకుందానంద బ్రహ్మచారి తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో యాత్రకు సంబంధించిన బ్రోచర్లను తెలంగాణ రాష్ట్ర శంకరాచార్య స్వాగత కమిటీ చైర్మన్ చిలప్ప గారి లక్ష్మీరాజం, కో ఆర్డినేటర్లు సి.విజయ, సి.శ్రీకాంత్, సి.సౌమ్య, యుగ తులసి ఫౌండేషన్ వ్యవస్థాపకులు కె.శివ కుమార్, ఏకం సంస్థాన్ భారత్ దళ్ ప్రతినిధి ఎన్కే చతుర్వేదితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ యాత్రలో భాగంగా దేశంలోని 37 రాష్ట్రాల రాజధానుల్లో గో ధ్వజాన్ని ప్రతిష్టిస్తారని, అందులో భాగంగా అక్టోబర్ 9న స్వయంగా అవిముక్తేశ్వరానంద్ జీ హైదరాబాద్‌లో గో ధ్వజాన్ని ప్రతిష్ఠిస్తారని తెలిపారు.

హైదరాబాద్ నగరం.. మినీ ఇండియా

'మిలాద్-ఉన్-నబీ' ఊరేగింపులో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

జెండా ఊపి ఊరేగింపును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాగంటి.

ఎర్రగడ్డ, సెప్టెంబర్ 19: మినీ ఇండియాగా పేరు గాంచిన హైదరాబాద్ నగరం మత సామరస్యానికి చిరునామాగా వెలిసిందని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ అన్నారు. బోరబండలో గురువారం జరిగిన 'మిలాద్-ఉన్-నబీ' ఊరేగింపు సంబురాల్లో ఆయన పాల్గొన్నారు. మైనార్టీ సోదరులు మాగంటిని సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, బోరబండ ప్రాంతంలో దేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందిన వారు స్థిరపడి సోదరభావాన్ని చాటుతున్నారని పేర్కొన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణలోని అన్ని ప్రాంతాల అభివృద్ధితో పాటు అన్ని మతాలకు ప్రాధాన్యత ఇచ్చిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. ప్రధానంగా రంజాన్, క్రిస్మస్, బతుకమ్మ లాంటి పండుగలను ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న విషయం అందరికీ తెలిసిందేనని గుర్తు చేశారు. అంతకు ముందు మైనార్టీ సోదరుల భారీ ఊరేగింపు వీకర్ సెక్షన్ నుంచి మొదలైంది. హైటెక్ హోటల్, సైట్-3, సైట్-2, స్వరాజ్‌నగర్ బోరబండ బస్ టెర్మినల్ చౌరస్తా మీదుగా ముందుకు వెళ్లింది. ఊరేగింపు అనంతరం సామూహిక ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు మహ్మద్ సర్దార్, మొయిజ్, షరీఫ్, ఖదీర్, మహ్మద్ యూసుఫ్, ముక్రమ్, తౌఫిక్, ఇలియాస్, జుబేర్, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు కృష్ణమోహన్, పార్టీ నేతలు ఎన్.విజయ కుమార్, ఇర్ఫాన్, ఖలీల్, ధర్మ, బాబూరావు, పాష పాల్గొన్నారు.

ఇంధన వనరులుగా కర్బన ఉద్గారాలు

సిటీబ్యూరో, సెప్టెంబర్ 19(నమస్తే తెలంగాణ): కర్బన ఉద్గారాలే భవిష్యత్ ఇంధన వనరులని, వాతావరణంలో ఉన్న సమీకరించి ప్రాసెస్ చేయడమే ప్రధానమైన సవాలుగా మారుతుందని ఐఐసీటీ వేదికగా జరుగుతున్న జాతీయ సదస్సులో పలువురు వక్తలు వ్యాఖ్యానించారు. రెండో రోజు జాతీయ సదస్సులో భాగంగా నిర్వహించిన టెక్నికల్ సదస్సులో నెట్ జీరో, కార్బన్ నియంత్రణ, ప్లాస్టిక్ వ్యర్థాలు, బయోమాస్, ప్లాస్టిక్ బాటిల్స్ రీసైక్లింగ్‌లో రసాయన చర్యలు, ఆధునాతన శక్తి వనరులు, గ్రీన్ కెమిస్ట్రీ వంటి అంశాలపై టెక్నికల్ టాక్ నిర్వహించారు. శుక్రవారం జరిగే టెక్నికల్ సెషన్‌తో మూడు రోజుల జాతీయ సదస్సు ముగియనుంది. కాగా, వాతావరణంలో ఉన్న కర్బన్ ఉద్గారాలను నిలువరించి, వాటిని ప్రత్యామ్నాయ ఇంధన వనరులుగా తీర్చిదిద్దేలా పరిశోధనలు ముమ్మరం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పరిశోధకులు అభిప్రాయపడ్డారు. సమావేశంలో ఐఐటీ మద్రాస్, ముంబై, హైదరాబాద్, రూపూర్, ఇండోర్, ఖరగ్‌పూర్, అన్నా యూనివర్సిటీ, సీఎస్ఐఆర్-ఎన్‌సీఎల్ పుణే, సీఎస్ఐఆర్-సీఈఆర్ఐకి చెందిన పరిశోధకులు, సీనియర్ విద్యావేత్తలు, పరిశోధన విద్యార్థులు పాల్గొన్నట్లుగా ఐఐసీటీ వర్గాలు పేర్కొన్నాయి.

హైడ్రా పేరుతో పేదలను రోడ్డున పడేయొద్దు

ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

చిక్కడపల్లి, సెప్టెంబర్ 19: హైడ్రా ప్రకృతి, పర్యావరణం, చెరువులు, నాలాలు, పార్కులను కాపాడే పేరుతో పేదలను రోడ్డున పడేయొద్దని, పేదల ఆస్తులకు ప్రతామ్నాయం చూపాలని ఎమ్మెల్సీ నర్సిరెడ్డి అన్నారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఇందుకు ముఖ్య అతిథిగా హాజరైన నర్సిరెడ్డి మాట్లాడుతూ, ఈ ఏడాది 4, 5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు నిర్మించబోతున్నట్టు సీఎం రేవంత్ ప్రకటించారని తెలిపారు. మూడు నెలల్లో ఈ పని సాధ్యమవుతుందని ఆయన ప్రశ్నించారు. ఆచరణలో సాధ్యం కాని ప్రకటనలు చేయడం సరికాదన్నారు. ఇప్పటికే నిర్మించినా.. ఇండ్లు డబుల్ బెడ్ రూం, రాజీవ్ స్వగృహ, గృహకల్ప ఇండ్లను పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. ఇండ్లు, ఇంటి స్థలం లేని పేదలకు స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. ఇలాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు పూర్తి చేసి హైడ్రా కూల్చివేతలకు పూనుకుంటే సరే గాని, లేదంటే తీవ్ర ప్రతిఘటనను ప్రభుత్వం ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. చెరువులు, ఎఫ్‌టీఎల్, ఫర్ జోన్ స్థలాలు, నాలాలు, పార్కులు, ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురై అక్రమ నిర్మాణాలు ఏర్పడ్డాయన్నారు. ఇలాంటి నిర్మాణాలపై హైడ్రా చర్యలు చేపడితే సుమారు 20 శాతానికి పైగా భవనాలు, మామూలు గృహ నిర్మాణాలు కుప్పలుగా నేలమట్టం కావాల్సిందేనని, ఈ నష్టానికి ఎవరు బాధ్యత వహించాలని ఆయన ప్రశ్నించారు. సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల జి.నాగయ్య, ఆర్.వెంకట్రాములు మాట్లాడుతూ పేదల ఇండ్లు తొలగిస్తే సహించేది లేదని, పేదల జోలికి రావొద్దని ప్రభుత్వానికి హెచ్చరించారు. పలువురు నాయకులు ఎస్.మల్లారెడ్డి, స్కైలాబ్ బాబు, శ్రీరాం నాయక్, అబ్బాస్ పాల్గొన్నారు.

దేవాదాయ శాఖ ఆదాయానికి గండి!

- అమ్మవారి చీరలకు లక్షల్లో టెండర్లు
- గుత్తేదార్లకు కోట్లలో సంపాదన
- బయట పడుతున్న గుత్తేదార్ల అక్రమ సంపాదన

ఉజ్జయినీ మహాకాళి అమ్మ వారి దేవాలయం (ఫైల్)

బేగంపేట్ సెప్టెంబర్ 19: సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయినీ మహాకాళి అమ్మవారి ఆలయంలో జరిగే అమ్మవారి చీరల టెండర్లలో కాంట్రాక్టర్‌కు, ఈవో మధ్య చెలరేగిన వివాదం సుప్రీం కోర్టుకు వరకు వెళ్లింది. ఈ దేవాలయంలో అమ్మవారికి వచ్చే చీరల టెండర్లను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తుండగా, వారు చెల్లించేది లక్షల్లో ఉంటే గుత్తేదారులకు మాత్రం కోట్లలో ఆదాయం తెచ్చి పెడుతున్నాయి. ఇటీవల ఈ చీరలకు సంబంధించిన అంశంలోనే ఈవోకు గుత్తేదారుకు మధ్య వివాదం తలెత్తి సుప్రీం కోర్టు వరకు వెళ్లింది. దీనిపై ఆరా తీయగా చీరల టెండర్లలో అమ్మ వారి ఆదాయానికి టెండర్ పెట్టిన వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. 2024-25 సంవత్సరానికి గాను చీరల టెండర్ రూ.48 లక్షలకు దక్కించుకోగా, అధికారులు రెండు నెలల చీరలకు లెక్కిస్తేనే 80 లక్షల ఆదాయం వస్తున్నట్టు గుర్తించారు. ఏడాది మొత్తం లెక్కిస్తే రూ. 2 కోట్ల వరకు ఆదాయం వస్తున్నట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. ఇది ఇలా ఉండగా, కాంట్రాక్టర్‌కు, ఈవోకు మధ్య వివాదం కోర్టులో నడుస్తుండగా చీరలను అధికారులు దేవాలయంలోనే భద్ర పరిచారు. అధికారులు ఇటీవల లెక్కించగా జూలై, ఆగస్టు రెండు నెలల్లోనే 16,175 చీరలు దేవాలయానికి వచ్చాయి. ఇందులో రూ.10 నుంచి 15వేల చీరల వరకు రూ.5 వందల ధర గల చీరలు ఉన్నాయి. వీటిని లెక్కించగా, వీటి విలువ 80 లక్షల వరకు ఉంటుందని అంచనా వేశారు. దసరా నవరాత్రులో పాటు మిగతా కాలంలో లెక్కిస్తే అమ్మవారికి వచ్చే చీరల విలువ రెండు కోట్లు దాటే అవకాశం ఉంటుంది. అందుకు కాంట్రాక్టర్ కట్టిన డబ్బులు మొత్తం చెల్లిస్తానని అన్నా.. సదరు కాంట్రాక్టర్ చీరలే కావాలని పట్టుపడుతున్నట్టు తెలిసింది.

హోంగార్డు పెండింగ్ సమస్యలను పరిష్కరించండి

సీఎం సలహాదారుకు హోంగార్డుల సంఘం వినతి

సిటీబ్యూరో, సెప్టెంబర్ 19(నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్రంలో పనిచేస్తున్న హోంగార్డు సమస్యలను పరిష్కరించాలని గురువారం రాష్ట్ర హోం గార్డుల సంఘం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. తెలంగాణలో ఉన్న 16 వేల మంది హోం గార్డుల జీవితాల్లో వెలుగులు నింపాలని, అందుకు హోంగార్డులను పర్మనెంట్ చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని, ఎస్పీఏ ఫైల్‌ను పునఃపరిశీలించాలని, తదితర అంశాలను ఆయన దృష్టికి తీసికెళ్లారు. హోంగార్డులు చాలీచాలని జీతాలతో ఇబ్బందులు పడుతున్నారని, ఇంకా చాలా మందికి ఈ నెల జీతాలు కూడా రాలేదని ఆయన దృష్టికి తీసికెళ్లినట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ హోంగార్డ్స్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొత్వాల్ దయానంద్, ఉపాధ్యక్షుడు మహ్మద్ తహేర్, ట్రై కమిషనరేట్ల ప్రతినిధులు అశోక్ కుమార్, హరిబాబు, జాయింట్ సెక్రటరీ నారాయణ రెడ్డి, శివ నారాయణ దపాల్గొన్నారు.

రోహిత్‌కు గవర్నర్ అభినందనలు

తెలంగాణ యువ పర్వతారోహకుడు మాదాసు రోహిత్ రావును గవర్నర్ జిష్ణుదేవ్ గురువారం ప్రత్యేకంగా అభినందించారు. 2018 నుంచి ఇప్పటి వరకు ప్రపంచంలోని 10 పర్వతాలు అధిరోహించిన రోహిత్, గవ